క్లుప్తంగా

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తుర్కయంజాల్: స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములై పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీ.హెచ్. శ్రీకాంత్, తుర్కయంజాల్ కౌన్సిలర్ మంగమ్మ కోరారు. శనివారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా తుర్కయంజాల్‌లోని శ్రీరామ్‌నగర్ కాలనీలో పేరుకుపోయిన వ్యర్థాలను సిబ్బందితో కలిసి తొలగించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడే వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ధరణి కుమార్

తుర్కయంజాల్: కుష్టు వ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ ధరణి కుమార్ తెలిపారు. కుష్టు వ్యాధి నిర్మూలన, వ్యాధి గ్రస్తుల గుర్తింపుపై శనివారం తుర్కయంజాల్, రాగన్నగూడలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధరణి కుమార్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి గ్రస్తుల పట్ల వివక్ష చూపకూడదని, వ్యాధి సోకినా.. లక్షణాలతో బాధపడుతున్న వారి వివరాలను వైద్య సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. సకాలంలో వైద్యం తీసుకుంటే వ్యాధి నుంచి బయట పడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ అనురాధ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

3న చలో హైదరాబాద్

ఇబ్రహీంపట్నం: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 3న తేదీన చలో హైదరాబాద్ కార్యాక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ నాయకుడు ఏల్లేశ్ తెలిపారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం మున్సిపల్ అధికారులకు శనివారం నోటీసు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇస్తున్నట్లుగా రూ. 21 వేల వేతనం ఇవ్వాలన్న డిమాండ్లతో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గ్రామాభివృద్ధికి రూ. 20 లక్షలు



ఉత్తర్వుల కాపిని గ్రామస్తులకు అందజేస్తున్న ఎమ్మెల్యే

యాచారం: మండలంలోని చింతుల్ల గ్రామాభివృద్ధికి రూ. 20 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. గ్రామంలోని పలు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చింతుల్ల సర్పంచ్ సబిత, మాజీ సర్పంచ్ సత్యపాల్ పాల్గొన్నారు.

ఎమ్మెస్ స్వామినాథన్‌కు నివాళి

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లిలో శనివారం పద్మభూషణ్ గ్రహీత, శాస్త్రవేత్త ఎమ్మెస్ స్వామినాథన్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య, వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి, జేఏసీ నాయకులు డేవిడ్, దామోదర్, రేణురెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఆశ'ల సమ్మె

ఇబ్రహీంపట్నం: సమస్యల సాధన కోసం ఆశ వర్కర్లు సమ్మెబాట పట్టారు. వీరి సమ్మె శనివారానికి ఆరో రోజుకు చేరుకుంది. నెల నెలా ఇస్తున్న పారితోషకం వద్దని ఫిక్స్‌డ్ వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న టీబీ, లెప్రసీ, కంటి వెలుగు తదితర బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు. సమ్మెతో గ్రామీణ ప్రాంతాల్లో రోగులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు.

అర్హులకే దళితబంధు ఇవ్వండి

ఇబ్రహీంపట్నం రూరల్: దళితులందరికీ దళితబంధు ఇవ్వాలని ఆకులమైలారం గ్రామానికి చెందిన మహిళలు డిమాండ్ చేశారు. శనివారం మహిళలు జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

ఉచిత విద్యుత్ ఇవ్వాలి

ఇబ్రహీంపట్నం: ఎస్సీ, ఎస్టీ, ఉప కులాలకు 301 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సామేల్ డిమాండ్ చేశారు. శనివారం విద్యుత్ ఏడీ కార్యాలయం ఎదుట ఉచిత విద్యుత్ ఇవ్వాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 342 జీవోను సవరించి నెలకు 101 నుంచి 301 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు వీరేశం, ఆనంద్, గణేశ్, యాదగిరి పాల్గొన్నారు.

అంతా అస్తవ్యస్తం

- రోడ్లపైనే చెత్తకుప్పలు
- ఇళ్ల మధ్యలో పారుతున్న మురుగు
- దోమలు, పందుల స్వైర విహారం
- రోగాల బారిన జనం
- పట్టించుకునే నాథుడే కరువు

సాక్షి విజిట్

అబ్దుల్లాపూర్‌మెట్: చినుకు పడితే వణుకే.. ఇంటి నుంచి రోడ్డుపైకి వస్తే ముక్కు మూసుకోవాల్సిందే. మున్సిపల్ పైపుల్లో నీటిని తాగాలంటే ఆలోచించాల్సిందే. అధ్వానమైన డ్రైనేజీ, అపరిశుభ్రత, సీజనల్ వ్యాధులు.. ఇదీ అబ్దుల్లాపూర్‌మెట్ ప్రజల దుస్థితి. పురపాలక సంఘం నిర్వహణ లోపం స్థానికులకు శాపంగా మారింది. ప్రధాన రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తుండడంతో అవి కుప్పలుగా పేరుకుపోతోంది. డ్రైనేజీ అవుట్‌లెట్ సరిగ్గా లేకపోవడంతో రోడ్లపై మురుగు నీటితో పాటు, వర్షపు నీరు ప్రవహించడంతో ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. వీటికి తోడు పందులు స్వైర విహారం చేస్తున్నాయి. అసలే వర్షాకాలం ప్రబలుతున్న విష జ్వరాలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలో నిర్వహణలోపంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది.

పేరుకుపోయిన చెత్తా చెదారం

ప్రతిరోజు చెత్తను సేకరించి శుభ్రం చేయించాల్సిన అధికారులు పట్టించు కోకపోవడంతో ఎక్కడ వేసిన చెత్త అక్కడే కుప్పలుగా పేరుకుపోతున్నాయి. దీంతో దుర్వాసన వెదజల్లడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలో మొత్తం 24 వార్డులు ఉన్నాయి. సుమారు 150 వరకు కాలనీలున్నాయి. పెద్దఅంబర్‌పేట నుంచి కోహెడా, కుంట్లూర్ నుంచి పసుమాములకు, పసుమాముల నుంచి పెద్దఅంబర్‌పేటకు



పెద్దఅంబర్‌పేటలో ఇళ్ల మధ్య మురుగు

వచ్చే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా వేస్తున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించకపోవడంతో కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. దీంతో పాటు డ్రైనేజీ అవుట్ లెట్ లేకపోవడంతో మురికినీటితో పాటు వర్షపు నీరు కూడా ఇళ్ల మధ్యలోనే నిలిచిపోవడంతో రాత్రి సమయాల్లో బయటకు వెళ్లాలంటేనే వణికిపోతున్నారు.కళానగర్‌లో ఇళ్ల మధ్య నుంచే వరదనీటి కాలువను నిర్మించారు. దీంతో వర్షాలు కురిసిన ప్రతిసారి కాలువలు పొంగిపొర్లి ఇళ్లలోకి వరదనీరు చేరుతోంది. పైపులైన్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు.

అందరికీ చిన్నచూపే



మా కళానగర్‌పై అటు అధికారులకు, ఇటు ప్రజాప్రతినిధులకు ఎప్పుడూ చిన్నచూపే చూస్తున్నారు. మా కాలనీలో ఇళ్ల మధ్య లోంచి ఉన్న వరద కాలువ, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. వర్షం వచ్చిన ప్రతిసారి వరద నీరు ఇళ్లల్లోకి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దోమలు, ఈగల వల్ల రోగాల బారిన పడుతున్నాం.

– మణెమ్మ, కళానగర్, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ.



ఇబ్రహీంపట్నంలో పొర్లుదండాలతో అంగన్‌వాడీల నిరసన

అంగన్‌వా'డీ'

- ప్రభుత్వ మొండి వైఖరి విడనాడాలి
- సమస్యలు పరిష్కరించాలి
- అంగన్‌వాడీల డిమాండ్

ఇబ్రహీంపట్నం: అంగన్‌వాడీలు సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో ఢీ అంటే ఢీ అని తలపడుతున్నారు. 20 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో శనివారం ఇబ్రహీంపట్నంలో వినూత్నంగా పొర్లుదండాలతో నిరసన తెలియజేశారు. సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తుంటే... విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం, ప్రమాదభీమా, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎల్లేశ్, బుగ్గరాములు, నర్సింహ్మా, అంగన్‌వాడీ టీచర్లు బాలమణి, బేబి, గీత, వనజ, హేమలత, సరిత పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఆమనగల్లు: అంగన్‌వాడీ సిబ్బందిని తక్షణమే పర్మినెంట్ చేసి ప్రభుత్వం శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని ప్రాజెక్టు ఉపాధ్యక్షురాలు పద్మమ్మ డిమాండ్ చేశారు. ఆమనగల్లు బస్టాండ్ ఆవరణలో అంగన్‌వాడీలు సమ్మెకు దిగారు.

వంటావార్పు

తలకొండపల్లి: అంగన్‌వాడీ సిబ్బంది పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు కురుమయ్య డిమాండ్ చేశారు. నెలకు రూ. 26,000 వేతనం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా వంటావార్పు కార్యక్రమాన్ని అంగన్‌వాడీ సిబ్బంది నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రకళ, మల్లమ్మ, పుష్పమ్మ, అనంతమ్మ, గిరిజ, అనసూయ, యాదమ్మ, సువర్ణదేవి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్‌రెడ్డి

వంద కోట్ల ఆర్థిక లావాదేవీలే లక్ష్యం

యాచారం పీఏసీఎస్ ఛైర్మన్ రాజేందర్‌రెడ్డి

యాచారం: రూ. వంద కోట్ల ఆర్థిక లావాదేవీలే లక్ష్యంగా పీఏసీఎస్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ఆ సంఘం చైర్మన్ రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో శనివారం సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాచారం పీఏసీఎస్ ప్రస్తుతం రూ. 80 కోట్ల ఆర్థిక లావాదేవీలతో నడుస్తుందని తెలిపారు. వచ్చే ఏడాదిలో రూ. వంద కోట్ల ఆర్థిక లావాదేవీలు జరిగే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 2,031 మంది రైతులకు రూ. 55 కోట్ల దీర్ఘకాలిక రుణాలు, రూ. 5.50 కోట్ల బంగారు రుణాలు, రూ. 6 కోట్ల వ్యక్తిగత రుణాలు, రూ. 6 కోట్ల క్రాప్ లోన్లు ఇచ్చినట్లు తెలిపారు. సకాలంలో రుణాలు చెల్లిస్తే అదనంగా రుణాలు పొందడంతో పాటు ఇతర రైతులకు కూడ రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు.

అర్హులైన రైతులకు రుణమాఫీ వర్తింపు

యాచారం పీఏసీఎస్‌లో వ్యవసాయ పంట రుణాలు పొందిన అర్హులైన రైతులకు రూ. లక్షలోపు రుణమాఫీ వర్తించనున్నట్లు చైర్మన్ తెలిపారు. పీఏసీఎస్‌లో 1,849 మంది రైతులకు రూ. 6 కోట్లకు పైగా రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. మొత్తం రైతులకు రూ. 9.43 కోట్ల రుణమాఫీ నిధులు మంజూరు కావాల్సి ఉండగా, నేటికి రూ. 4.55 కోట్ల నిధులు వచ్చినట్లు తెలిపారు. విడతల వారిగా రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాదయ్యగౌడ్, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, లక్ష్మయ్య, స్వరూప, శశికళ, సంఘం సీఈఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

- సంక్షేమ పథకాల అమలుపై చర్చ
- సమస్యలను ఏకరవు పెట్టిన సభ్యులు
- కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఎంపీపీ హామీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నర్మద తదితరులు

మంచాల: మంచాల మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. మంచాల మండల కార్యాలయంలో ఎంపీపీ నర్మద అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభంలోనే ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరుట్ల సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, మంచాల ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి, జాపాల ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. గ్రామాల్లో బీసీబంధు, గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపిక ఏ ప్రతిపాదికన నిర్వహించారని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు తక్షణమే బిల్లులు చెల్లించాలని మంచాల సర్పంచ్ జగన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గ్రామాల్లో విద్యుత్ వైర్లు తెగిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరుట్ల సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శిథిలావ్యవస్థలో ఉన్న స్తంభాలను తొలగించాలని, కొత్త వైర్లు అమర్చాలన్నారు. 24 గంటలు త్రీఫేజ్ కరెంట్ సరఫరా కావడం లేదని 12 గంటలు మాత్రమే సరఫరా చేస్తున్నారని ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి తెలిపారు. గ్రామాల్లో పంట రుణాల మాఫీ కూడా అర్హులందరికీ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కారించాలని చీడేడ్ సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి కోరారు. గ్రామ పంచాయతీల్లో అండర్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రభుత్వం నిదులు మంజూరు చేయడం లేదని మంచాల జడ్పీటీసీ నిత్యరెడ్డి తెలిపారు. డ్రైనేజీ అస్తవ్యస్తంగా మారండంతో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయని, వైద్యశాఖ అధికారులు ప్రజలకు అవసరమైన మందులు అందించాలని డిమాండ్ చేశారు. ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు దీక్షలు చేస్తున్నారని తెలిపారు. వారికి మద్దతు తెలిపి ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కారించాలని సర్వ సభ్య సమావేశంలో తీర్మానం చేయాలని కోరారు. అనంతరం ఎంపీపీ నర్మద మాట్లాడుతూ సమావేశంలో సభ్యులు ప్రతిపాదించిన అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. మండలంలో నెలకొన్న సమస్యలను కూడా పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ వెంకట ప్రసాద్, డీఈఈ అబ్బాస్, సీడీపీఓ శాంతి శ్రీ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రూ.2.38 కోట్ల ఆదాయం

అబ్దుల్లాపూర్‌మెట్: ఆరు మాసాల్లో సహకార సంఘానికి రూ. 2.38 కోట్ల ఆదాయం వచ్చిందని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డి తెలిపారు. వ్యవసాయ, వ్యవసాయేతర, బంగారు ఆభరణాలపై ఇచ్చే రుణాల వడ్డీని 14.5 శాతం నుంచి 12 శాతానికి తగ్గించి రైతులకు మరింత మేలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లో శనివారం జరిగిన సంఘం 53వ మహాజనసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి మాట్లాడుతూ పంట అప్పుపై ప్రస్తుతం తీసుకుంటున్న 12.5శాతం వడ్డీని 10 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. సంఘం నుంచి రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన రైతులకు ప్రోత్సాహకంగా రూ.5వేల నగదుతో



సమావేశంలో మాట్లాడుతున్న విఠల్‌రెడ్డి

పాటు శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ జంగయ్యయాదవ్, డైరెక్టర్లు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, భరత్, యాదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, లక్ష్మమ్మ లతో పాటు సర్పంచులు సుధార్‌రెడ్డి, రైతులుపాల్గొన్నారు.

రైతులకు పీఏసీఎస్ చేయూత

ఆమనగల్లు: రైతులకు అన్ని రకాల రుణాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నామని పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్ అన్నారు. శనివారం ఆమనగల్లు మండల కేంద్రంలో పీఏసీఎస్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా రైతులకు వివిధ రకాల రుణాలు ఇచ్చామని తెలిపారు. పూర్తి స్థాయిలో రుణమాఫీ అయిన రైతులందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సత్యం, డైరెక్టర్స్ వీరయ్య, అరుణమ్మ, అంతిరెడ్డి, వెంకటేశ్, శ్రీపాల్, సేవ్య, డోల్యానాయక్, జంగమ్మ, మేనేజర్, సీఈఓ దేవేందర్, సభ్యులు అల్లాజి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

ఇబ్రహీంపట్నం: ఆరోగ్యమే మహాభాగ్యమని కౌన్సిలర్ మమత సూచించారు. స్వచ్ఛత లీగ్-2 కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం 9వ వార్డులో శనివారం నిర్వహించిన శ్రమదాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ మున్సిపాలిటీ చెత్త బండ్లలోనే చెత్త వేయాలని సూచించారు. మహిళలు కాలుష్య నివారణలో ప్రధాన భూమిక పోషించాలని కోరారు. మంచినీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. ఆరోగ్యం పట్ల అందరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గోపిగౌడ్, తిరుమల్‌రావు, లక్ష్మణ్, రవి, మహేశ్, అనురాధ, అంజమ్మ, వార్డు ఆఫీసర్ జంగయ్యలు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని అత్యధిక మోజార్టీతో గెలిపిద్దాం

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్

యాచారం: 'మండలంలోని ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిద్దాం, నాలుగోసారి ఆయనను అత్యధిక మోజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించుకుందాం' అని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. యాచారం మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి ఓట్లు అడుగుదామని అన్నారు.

రేపు యాచారానికి ఎమ్మెల్యే

ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి సోమవారం యాచారం మండల పర్యటనకు వస్తున్నట్లు రమేశ్‌గౌడ్ తెలిపారు. యాచారం, మంతన్‌గౌరెల్లి, కేసీతండా, తక్కళ్లపల్లి తదితర గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌గౌడ్ తదితరులు

ఆయన తెలిపారు. ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి భాషా, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

- యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్ష

కడ్తాల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్ ఆధ్వర్యంలో శనివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మండల కేంద్రం ఏర్పాటై ఏడేళ్లు దాటినా ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయకుండా ప్రజాప్రతినిధులు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కారమయ్యే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, ఎస్సీసెల్ అధ్యక్షుడు ఆశోక్, నాయకులు ఇక్బాల్, మల్లేశ్‌గౌడ్, రాంచందర్‌నాయక్, తులసీరాం, రాజేందర్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

పోరుబాటలో మధ్యాహ్న భోజన కార్మికులు

ఇబ్రహీంపట్నం: మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. అరకొర వసతులతో అష్టకష్టాలు పడుతూ విద్యార్థులకు వండి పెడుతున్నా తమకు కనీస వేతనం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించాలని శనివారం ఇబ్రహీంపట్నంలో ర్యాలీ నిర్వహించారు. ఉద్యోగ భద్రత కల్పిస్తూ గుర్తింపు కార్డులు, జీతాలు ఇవ్వాలని, విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని, రూ. 5 లక్షల ప్రమాద బీమా, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బుగ్గరాములు, ఎల్లేశ్, నర్సింహ్మా, మధ్యాహ్న బోజన కార్మికులు స్వప్న, పద్మ, హంసమ్మ, జయమ్మలు పాల్గొన్నారు.

పెంచిన వేతనాలు ఇవ్వాలి

ఆమనగల్లు: జీఓ 8 ప్రకారం పెంచిన జీతాలను వెంటనే ఇవ్వాలని మధ్నాహ్న భోజన కార్మిక సంఘం ఆమనగల్లు మండల కార్యదర్శి పద్మ డిమాండ్ చేశారు. ఆమనగల్లు ఎంఈఓ కార్యాలయం ఎదుట కార్మికులు సమ్మె కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా మెనును సవరించాలని, మార్కెట్ ధరలకనుగుణంగా కోడిగుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, వంట గ్యాస్‌కు సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

డిమాండ్లు పరిష్కరించాలి

తలకొండపల్లి: మధ్యాహ్న బోజన కార్మికుల న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా కమిటి సభ్యుడు కురుమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీఓ 8 ప్రకారం పెంచిన జీతాలను వెంటనే ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్ర లాంటి స్వచ్ఛంద సంస్థలకు అప్పజెప్పడం ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈ సంఘం మండల కార్యదర్శి రమాదేవి, ప్రేమలత, కమలమ్మ, పద్మమ్మ, విజయ, అంజమ్మ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి

మంచాల: రైతుల సంక్షేమానికే పెద్దపీట వేశామని మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పుల్లారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఏసీఎస్ నుంచి 1,804 మంది రైతులకు 7,80,40,337లకు సంబంధించిన రుణమాఫీ జాబితాను ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు. పది దఫాలుగా 1207 మందికి రూ. 4,83,51,557 రుణమాఫీకి జమ చేయడం జరిగిందన్నారు. ఇంకా 597 మంది రైతులకు రూ.2కోట్ల 90లక్షలు మాఫీ కావాల్సి ఉందని చెప్పారు. రుణమాఫీ అయిన వారికి తిరిగి కొత్త రుణాలు ఇస్తామని పేర్కొన్నారు. తమ సంఘం ద్వారా రైతులకు అన్ని రకాల ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. బంగారు అభరణాలపై రుణాలు తీసుకున్న వారు తిరిగి చెల్లించాలని కోరారు. అప్పులు తీసుకున్న వారు సకాలంలో తిరిగి చెల్లిస్తేనే కొత్త వారికి రుణాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాదయ్య, డైరెక్టర్లు రాంరెడ్డి, హన్మంత్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి ,వెంకటేష్, సత్యనారాయణ,అరుణమ్మ, ఎంపీటీసీ సభ్యుడు ఎడ్మా నరేందర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు వాజీద్ సీఈఓ శ్రీనివాస్, క్యాషియర్ రమేష్, కంప్యూటర్ ఆపరేటర్ సంతోష్, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ పుల్లారెడ్డి తదితరులు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తునట్లు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ మండల, మున్సిపాలిటీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. సీఎం కేసీఆర్ పాలనలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. పార్టీ గెలుపునకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి